## 7న నిథమ్‌లో 'టూరిజం టౌన్‌ హాల్‌'

రాయదుర్గం: నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజమ్‌ అండ్‌ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ (నిథమ్‌)లో పర్యాటక, ఆతిథ్య రంగాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్నవారి కోసం ఆగస్టు 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు 'టూరిజం టౌన్‌హాల్‌' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం నిర్వహించే సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్‌ ఇలాత్రిపాఠి, తాజ్‌కృష్ణ ఏరియా జనరల్‌ మేనేజర్‌, ఏరియా ఆపరేషన్స్‌ డైరెక్టర్‌ పంకజ్‌ సంపత్‌, నోవాటెల్‌ కన్వెన్షన్‌ సెంటర్‌ జనరల్‌ మేనేజర్‌ రుబిన్‌చెరియన్‌, రాడిసన్‌ హోటల్‌ గ్రూప్‌ వెస్ట్‌ఇండియా ఏరియా జనరల్‌ మేనేజర్‌ సందీప్‌ జోషి, ఐటీసీ కాకతీయ జనరల్‌ మేనేజర్‌ అభిషేక్‌ మీననలు పాల్గొంటారు. మరిన్ని వివరాలకు, పేర్ల రిజిస్ట్రేషన్‌ కోసం ఫోన్‌ నంబర్లు 9553700035, 9703178671 సంప్రదించాలి.

## కుట్టుమిషన్లు పంపిణీ

చందానగర్‌: కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో లయన్స్‌ క్లబ్‌, హోప్‌ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఆదివారం కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ రీజియన్‌ చైర్మన్‌ కరుణాకర్‌గౌడ్‌, జోన్‌ చైర్మన్‌ కొండ విజయ్‌ , లయన్స్‌ క్లబ్‌ హోప్‌ అధ్యక్షులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బర్క మల్లేష్‌, సుధీర్‌, వెంకటేష్‌, కొండ విశ్వనాథ్‌, శేఖర్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం: గచ్చిబౌలి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్‌ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జయభేరి ఎన్‌క్లేవ్‌, ఏపీ హెచ్‌బీ కాలనీ, గచ్చిబౌలి స్ట్రీట్‌ నంబర్‌ 1,2,3 ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదని తెలిపారు.

# 'డ్రగ్స్‌' అనుమానితులుంటే సమాచారం ఇవ్వండి

'ఒక కిలో హెరాయిన్‌ స్వీట్‌ బాక్సులో వచ్చింది. బస్సులు, స్విగ్గీ, జొమోటోల ద్వారా గంజాయి, హెరాయిన్‌, టాబ్లెట్స్‌, ఆయిల్‌ తదితర రూపాలలో డ్రగ్స్‌ సరఫరా చేస్తున్నారు. దీని కోసం టెక్నాలజీతోపాటు అనేక రకాల సాధనాలు ఉపయోగిస్తున్నారు. డ్రగ్స్‌ అనుమానితులు ఉంటే సమాచారం అందించాలన్నారు మాదాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ డి.కృష్ణమోహన్‌. మాదాపూర్‌ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ఐటీ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉండడంతో ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని వారు అధిక డబ్బు సంపాదిస్తున్నారని చెప్పారు. అన్ని విభాగాలకు చెందిన డిపార్ట్‌మెంట్‌లు డ్రగ్స్‌ పట్టుకోవడానికి 24 గంటల పాటు పనిచేస్తున్నాయని తెలిపారు. ధూపం యాప్‌లో డ్రగ్స్‌ నిందితులు, వారికి సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరుస్తున్నామని తెలిపారు.

– మాదాపూర్‌

- మాదాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ డి.కృష్ణమోహన్‌
- ఐటీ పరిసరాల్లోనే ఎక్కువగా అమ్మకాలు
- నేరస్తులు టెక్నాలజీని సైతం ఉపయోగించుకుంటున్నారు



ప్రశ్న: మాదాపూర్‌లో డ్రగ్స్‌ అమ్మకాలు ,వినియోగం ఎక్కువగా ఉండడానికి కారణం?

జవాబు: మాదాపూర్‌ పరిసర ప్రాంతాలలో ఐటీ ఉద్యోగులు, సంపన్నులు నివసించే ప్రాంతం కావడంతో డ్రగ్స్‌ పెడ్లర్లు ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు. సిగరెట్‌, మద్యం, తో పాటు డ్రగ్స్‌కు ఎక్కువగా అలవాటు పడుతున్నారు. వాటిని సులభతరంగా సరఫరా చేసే మార్గాలను సైతం వారే కనిపెడుతున్నారు. ప్రధాన కూడళ్లలో ఎక్కువగా జనసంద్రం ఉన్న ప్రాంతాలలో వాటిని అమ్ముతున్నారు. విద్యావంతులే వీటిని ప్రోత్సహిస్తున్నారు.

ప్ర: ఎక్కువగా ఏ ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్నాయి?

జ: బెంగుళూరు, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌, రాజస్థాన్‌ తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా సరఫరా అవుతున్నాయి. గంజాయి, హెరాయిన్‌, టాబ్లెట్‌లు, హష్‌ ఆయిల్‌ ఇలా వివిధ రూపాలలో సప్లై చేస్తున్నారు. అవగాహన లేని డ్రైవర్లను ఎంచుకుని వారి ద్వారా నగరంలో పలు ప్రాంతాలలో తమ బంధువులు ఉంటారని వారికి పార్సిల్‌ ఇవ్వండంటూ సరఫరా చేస్తున్నారు.

ప్ర: నగరంలో గంజాయిని ఎలా సరఫరా చేస్తున్నారు?

జ: నగరంలో ఇదివరకే ఎంపిక చేసుకున్న ప్రాంతాలకు పార్శిల్‌ ద్వారా, స్విగ్గీ, జొమోటో, చిన్న చిన్న పార్సిల్‌లను తీసుకుపోయే సర్వీసుల ద్వారా ఎవరికీ అనుమానం రాకుండా సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి వినియోగదారులకు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 23 కేసుల్లో 50 మందిని అరెస్ట్‌ చేశాము. జనవరి నెలలో 48 కేజీల గంజాయి, 1 కేజీ హెరాయిన్‌, ఎండీఎంఏను పట్టుకున్నారు.

ప్ర: మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఎన్ని సెక్టార్‌లు ఉన్నాయి.. సిబ్బంది ?

జ: మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 7 సెక్టార్లు ఉండగా మొత్తం 120 మంది సిబ్బంది ఉన్నారు. ఇందులో ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్సైలు, ఏఎస్సైలు 5 మంది, హెడ్‌ కానిస్టేబుల్స్‌ 11 మంది. కానిస్టేబుల్స్‌ 94 మంది ఉన్నారు.

ప్ర: కేబుల్‌బ్రిడ్జిపై ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. తీసుకుంటున్న చర్యలు..?

జ: ప్రధానంగా కేబుల్‌బ్రిడ్జిపై ఆత్మహత్యలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి 10నిమిషాలకు ఒకసారి ప్రత్యేకంగా వచ్చే వారిని పెట్రోలింగ్‌ పోలీసులు గమనిస్తున్నారు. 24 గంటలు పెట్రోలింగ్‌ ఉంటుంది. ఎక్కువగా ప్రధాన కూడళ్లలో ,అనుమానాస్పదంగా ఉన్న ప్రాంతాలలో నిర్వహిస్తాము. గతంలో పెట్రోలింగ్‌ పోలీసుల వల్లనే కొంతమంది నిందితులను పట్టుకున్నాము, ఆత్మహత్య చేసుకునే వారిని కాపాడాం. ఏదైన సమస్య వస్తే 100కి డయల్‌ చేయాలి.




ప్ర: ఫోన్ల చోరీలు పెరిగిపోతున్నాయి. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి ?

జ: ప్రధాన కూడళ్లలో, హాస్టళ్లలో ఎక్కువగా మొబైల్స్‌ దొంగతనాలు జరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.చోరీ అయిన ఫోన్‌లను కనిపెట్టేందుకు ప్రభుత్వం సీఈఐఆర్‌ (సెంట్రల్‌ ఎక్విప్‌మెంట్‌ ఐడెంటిఫికేషన్‌ రిజిస్టర్‌) పోర్టల్‌ను అందుబాటులో ఉంచారు. దీని ద్వారా పోయిన ఫోన్‌ వివరాలను వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్‌చేయాలి. సంబంధిత పోలీస్‌స్టేషన్‌ సిబ్బంది వాటిని కనిపెట్టి అందజేస్తారు. ప్రతి ఒక్కరు పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

ప్ర: సైబర్‌ నేరాలపై మాదాపూర్‌ పరిధిలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి

జ: జనవరి నుంచి 198 కేసులు నమోదయ్యాయి.120 కేసులు దర్యాప్తులో ఉన్నాయి. గోల్డెన్‌ అవర్‌లో 20 ఫిర్యాదులు రాగా అకౌంట్లను ఫ్రీజ్‌ చేయించాం.

ప్ర: ధూపం యాప్‌ గురించి..?

జ: ఇది కేవలం డ్రగ్స్‌కి సంబంధించిన యాప్‌. ధూపం యాప్‌లో అరెస్ట్‌ చేసిన నిందితుల వివరాలను పొందుపరుస్తారు. నిందితులు ఏ ఫోన్‌ నంబర్లు వాడారు. బయటకి వచ్చిన తరువాత ఏ నంబర్లు వాడుతున్నారు. నిందితుడితో ఎవరు మాట్లాడుతున్నారు.. బంధువులు, ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారు..సరఫరా చేసిన విధానంపై పూర్తి సమాచారాన్ని యాప్‌లో ఉంచుతాము. దీని ద్వారా మరిన్ని కేసులను ఛేదించేందుకు అవకాశం ఉంటుంది.

## నేడు ఉచిత హోమియో శిబిరం

చందానగర్‌: కొండాపూర్‌లోని సీఆర్‌ ఫౌండేషన్‌లో ఆదివారం డి.కె.ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వారి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీఆర్‌ ఫౌండేషన్‌ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక అనారోగ్యం, అలర్జీ, శ్వాసకోశ సమస్యలు, చర్మ రుగ్మతలు, జీర్ణ సమస్యలు తదితరాలకు వైద్యులు పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు.

## కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 35, పచ్చిమిర్చి 55, బెండ 40, కాకర 50, దొండ 45, దోస 30, ఆలు 40, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్‌ 90, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 30, క్యారెట్‌ 60, చిక్కుడు 80, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 280.

## ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి

హెచ్‌సీయూ డిపో మేనేజర్‌ మురళీధర్‌రెడ్డి

రాయదుర్గం: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్‌ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో అధిక రాబడి తీసుకొచ్చిన వారికి, వాలీబాల్‌ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేసేవారికి తగిన ప్రోత్సాహం ఉంటుందన్నారు. నిరంతరం విధులను నిర్వహించేవారికి ఆటవిడుపుగా వాలీబాల్‌ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని రామకృష్ణనగర్‌ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్‌ పేర్కొన్నారు. శనివారం డివిజన్‌ పరిధిలోని రామకృష్ణనగర్‌లో స్థానికులతో కలిసి సీసీ రోడ్డు పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో హైదరాబాద్‌ నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్‌ నాయకులు నాగేశ్వరరావు, విష్ణు, బాలకృష్ణ, శ్రీనివాస్‌, పృథ్వీ, విజయ్‌ కుమార్‌, రవిచందర్‌, కృష్ణరెడ్డి, సతీష్‌, రమణారెడ్డి పాల్గొన్నారు.

## హెచ్‌సీయూలో క్లీన్‌ అండ్‌ గ్రీన్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో శనివారం 'క్లీన్‌ అండ్‌ గ్రీన్‌' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం కో ఆర్డినేటర్‌ డా.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని జాకీర్‌ హుస్సేన్‌ భవనం సర్కిల్‌లోని ఓల్డ్‌ స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌ ప్రాంతంలో ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు, విద్యార్థులు వ్యర్థాలు, చెట్ల కొమ్మలు తొలగించారు. అనంతరం హరిత మహోత్సవంలో భాగంగా 'ఏక్‌ పేడ్‌ మా కే నామ్‌' పేరిట విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు మొక్కలు నాటారు.

## 'మిస్‌ టీన్‌ ఇంటర్నేషనల్‌' లక్ష్యం

మిస్‌ టీన్‌ ఇండియా బిపాషా



చందానగర్‌: మిస్‌ టీన్‌ ఇంటర్నేషనల్‌ క్రౌన్‌ చాంప్‌ సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని మిస్‌ టీన్‌ ఇండియా బిపాషా స్పష్టం చేశారు. హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని మైహోమ్‌ భుజలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జులైలో జైపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మిస్‌ టీన్‌ ఇండియా పోటీలలో వైల్డ్‌ కార్డ్‌ ఎంట్రీతో పాల్గొనే అవకాశం కలిగిందన్నారు. వేలాదిమంది పాల్గొనగా నలుగురిని ఇంటర్నేషనల్‌ మిస్‌ టీన్‌ పోటీకి ఎంపిక చేశారని, అందులో తాను ఒకరిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో పుట్టానని, గాడియం స్కూల్లో చదువుకునే సమయంలో జీరో గార్బేజ్‌ కోసం కృషి చేశానన్నారు. జీరో వేస్ట్‌ గార్బేజ్‌ సాధనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. తన కుటుంబ ప్రోత్సాహం, సహకారం మరువలేనిదని, భవిష్యత్తులో ప్రపంచస్థాయిలో విజేతగా నిలవాలని కోరుకుంటున్నారని వివరించారు.

## మహిళ అదృశ్యం

రాయదుర్గం: మహిళ అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. నేపాల్‌ నుంచి వలస వచ్చిన హర్కారోకయ, సరితా రోకయ దంపతులు చిన్న అంజయ్యనగర్‌లో నివాసముంటున్నారు. సరిత (26) హౌస్‌ కీపింగ్‌ పనికి వెళ్తోంది. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. తిరిగి రాలేదు. దీంతో తెలిసిన వారు, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 5.2 పొడవు, నల్లరంగు షర్టు వేసుకొంది. కుడి చేయిపై సరిత అని టాటూ ఉందని ఆచూకీ తెలిసిన వారు ఏఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి, ఫోన్‌ నంబర్‌ 9441057345కు తెలియజేయాలని సూచించారు.

# మొక్కల పెంపకం అవసరాన్ని గుర్తించాలి

రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌ వీరయ్య



బ్రోచర్‌ను ఆవిష్కరించిన సంస్థ చైర్మన్‌ వీరయ్య

రాయదుర్గం: మొక్కల పెంపకం, సంరక్షణ బాధ్యత అందరిపైన ఉందని రాష్ట్ర అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌ పొదెంవీరయ్య అన్నారు. కొండాపూర్‌ బొటానికల్‌ గార్డెన్‌లోని రాష్ట్ర ఫారెస్ట్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో మొక్కల పెంపకం, అటవీ అభివృద్ధి, ఎకో టూరిజమ్‌పై ఆయన శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వన మహోత్సవం కార్యక్రమ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకతను అందరూ గుర్తించాలన్నారు. ఫారెస్ట్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ ద్వారా త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలం సీజన్‌లో ప్లాంటేషన్‌, హార్వెస్టింగ్‌పై ప్రత్యేకంగా సమీక్షించారు. వెదురు, యూకలిప్టస్‌ చెట్ల అమ్మకాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, ఐఎఫ్‌ఎస్‌ అధికారి రంజిత్‌నాయక్‌, సీజీఎం డివిరెడ్డి, అధికారులు స్కైలాబ్‌, మెదక్‌, వరంగల్‌, రంగారెడ్డి, సత్తుపల్లి, పాల్వంచ, కొత్తగూడెం డివిజన్లకు చెందిన డీఎంలు, బొటానికల్‌ గార్డెన్‌ ఇన్‌చార్జ్‌లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశంలో వైద్యుల కొరత ఉంది




వార్షికోత్సవంలో పాల్గొన్న డాక్టర్‌ మిను బాజ్‌పాయి తదితరులు

మాదాపూర్‌: అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని డిప్లొమెట్‌ నేషనల్‌ బోర్డు ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ మిను బాజ్‌పాయి అన్నారు. మాదాపూర్‌లోని యశోద ఆస్పత్రిలో డీఎన్‌బి వైద్యుల అసోసియేషన్‌ 3వ వార్షికోత్సవంను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వైద్యులు, రోగుల నిష్పత్తిలో భారీ అంతరాయం ఉందని దీన్ని తగ్గించేందుకు ప్రతి జిల్లాలో మెడికల్‌ కాలేజీని ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. నేషనల్‌ బోర్డు కూడా వంద పడకల ఆస్పత్రిలో డీఎన్‌బి కోర్సుల అనుమతి చాలా సులభంగా అందిస్తుందన్నారు. దీనివల్ల వైద్యులు పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ కోర్సు అభ్యసించవచ్చన్నారు. దేశంలో వైద్యుల కొరత తగ్గించడానికి నేషనల్‌ బోర్డు సీట్లసంఖ్యను భారీగా పెంచామని తెలిపారు. అనంతరం గోల్డ్‌మెడల్‌ సాధించిన వైద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు సురేష్‌కుమార్‌, ఖూబ్‌చంద్‌, రాజగోపాల్‌, కల్పన రఘునాథ్‌లు పాల్గొని ప్రసంగించారు.

# మెడికవర్‌లో షీ క్లినిక్స్‌ ప్రారంభం



మెడికవర్‌ ఆసుపత్రిలో షీ క్లినిక్స్‌ను ప్రారంభించిన గుల్నార్‌ విర్క్‌కృష్ణ తదితరులు

- కార్పొరేట్‌ వర్కింగ్‌ విమెన్స్‌కు ఉచిత కన్సల్టేషన్‌, క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ టెస్ట్‌
- వైద్య పరీక్షల్లో 30శాతం రాయితీ

మాదాపూర్‌: మాదాపూర్‌లోని మెడికవర్‌ ఉమెన్‌, చైల్డ్‌ ఆస్పత్రిలో కార్పొరేట్‌ వర్కింగ్‌ విమెన్‌లకు ప్రతి శనివారం గైనకాలజిస్ట్‌ కన్సల్టేషన్‌, క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ టెస్ట్‌ను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. ఉద్యోగులు తప్పనిసరిగా ఐడీ కార్డును చూపాలని సూచించారు. శనివారం కార్యక్రమాన్ని ప్రారంభించిన హాష్‌టాగ్‌ మార్కెటింగ్‌ వ్యవస్థాపకురాలు గుల్నార్‌ విర్క్‌కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడి, సరైన జీవన విధానం పాటించకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఇవి మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతాయని తెలిపారు.వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి చీఫ్‌ ఆఫ్‌ బిజినెస్‌ ఆపరేషన్స్‌ మహేశ్‌ దెగ్లూర్కర్‌, డాక్టర్‌ రవీందర్‌రెడ్డి, సెంటర్‌ హెడ్‌ కృష్ణప్రసాద్‌ పాల్గొన్నారు.

## పరిశోధనలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: పరిశోధనలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడం అవసరమని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ బీజే రావు పేర్కొన్నారు. హెచ్‌సీయూలో ఫెడరేషన్‌ ఆఫ్‌ ఏషియన్‌ బయోటెక్‌ అసోసియేషన్‌(ఎఫ్‌ఏబీఏ), హెచ్‌సీయూ, సైన్స్‌ గురుస్‌ యూఎస్‌ఏ సహకారంతో డ్రగ్‌ డిస్కవరీ అండ్‌ డెవలప్‌మెంట్‌పై రెండు వారాల వర్చువల్‌ వర్క్‌షాప్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఔషధాల తయారీ సంక్లిష్టమైనదని, వివిధ విభాగాలలో సమష్టి కృషి అవసరమన్నారు. కార్యక్రమంలో వెగాన్‌ ల్యాబ్స్‌ ప్రతినిధి ప్రశాంత్‌, సైన్స్‌ గురుస్‌ బోర్డు చైర్మన్‌ డాక్టర్‌ జగత్‌ ప్రసంగించారు. కార్యక్రమంలో 140 దేశాలకు చెందిన ప్రతినిధులు ఆన్‌లైన్‌ ద్వారా పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న దీప్‌మేళా

మాదాపూర్‌: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న దీప్‌ మేళా ఎగ్జిబిషన్‌ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటుంది. 200లకు పైగా ఉన్న స్టాల్స్‌లో సందర్శకులు వివిధ ఉత్పత్తులను విరివిగా కొనుగోలు చేశారు. ఎలైట్‌ ఆభరణాలు, డిజైనర్‌ వస్త్రాలు, చర్మసంరక్షణ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

## ఎస్‌బీఐ లేడీస్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో సరుకులు అందజేత



సాక్షి,సిటీబ్యూరో: స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా హైదరాబాద్‌ లేడీస్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో శనివారం మియాపూర్‌లోని వివేకానంద సేవా సంస్థలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. క్లబ్‌ అధ్యక్షురాలు రష్మీ సిన్హా వివేకానంద సేవా సంఘానికి సరుకులు, పిల్లలకు టీ–షర్టులు, సీనియర్‌ సిటిజన్‌లకు దుస్తులు, ఇతర వస్తువులను అందజేశారు. సీనియర్‌ సిటిజన్లకు వైద్య శిబిరం నిర్వహించి మందులు అందించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్‌ ప్రెసిడెంట్‌ మిలి వర్మ, సెక్రటరీ అనిత శర్మ, క్లబ్‌ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యాక్సినేషన్‌ శిబిరం

రాయదుర్గం: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌ క్యాంపస్‌లో చిన్నారులకు ఉచిత వ్యాక్సిన్‌ వేశారు. మెదడువాపు వ్యాధి నివారణకు సంబంధించి వ్యాక్సినేషన్‌ శిబిరాన్ని శనివారం బెటాలియన్‌ కమాండెంట్‌ సన్నీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ చిన్నారులలో వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయించాలన్నారు. అదనపు కమాండెంట్‌ బీవి రెడ్డి, వీరయ్య, అసిస్టెంట్‌ కమాండెంట్లు ఎస్‌ రాంబాబు, రహమాన్‌, పార్థసారథి, ఎం నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

## నయనానందకరం.. నృత్యరూపకం

రాయదుర్గం: వేంకటేశ్వరస్వామి కల్యాణ నృత్య రూపకం నయనానందకరంగా సాగింది. గచ్చిబౌలిలోని గ్లోబల్‌ పీస్‌ ఆడిటోరియంలో శనివారం అక్షధ స్కూల్‌ ఆఫ్‌ పెర్ఫార్మింగ్‌ ఆర్ట్స్‌ ఆధ్వర్యంలో ప్రముఖ గురువు నిహంత్రిరెడ్డి పర్యవేక్షణలో ఆమె శిష్య బృందం కూచిపూడి నృత్యశైలిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫీనిక్స్‌ గ్రూప్‌ చైర్మన్‌ సురేష్‌ చుక్కపల్లి, బీజేపీ జాతీయ నాయకుడు అమర్‌దీక్షిత్‌, జర్నలిస్ట్‌ అన్నారావుతో పాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.





## అలరించిన నృత్యార్చన.. స్వరార్చన

మాదాపూర్‌: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం శ్రీ వాగ్దేవి నృత్యార్చన, ఆశ్రయ స్వరార్చన సందర్శకులను అలరించింది. శ్రీ వాగ్దేవి నాట్యస్థల్‌ గురువు శైలజ శిష్యబృందం నృత్యార్చన చేశారు. వీరికి వయోలిన్‌ విష్ణు, తారకరామ్‌, వాయిద్య సహకారం అందించారు. సంస్థ నిర్వాహకులు శోభారాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

## స్వచ్ఛదనం, పచ్చదనం ఉద్యమంలా సాగాలి

వెస్ట్‌ జోన్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్సీ ఉపేందర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛదనం, పచ్చదనం ఉద్యమంలా సాగేలా చూడాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌ శేరిలింగంపల్లి జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. వెస్ట్‌జోన్‌ పరిధిలోని అధికారులతో ఈ కార్యక్రమంపై ఆయన శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జోన్‌ వ్యాప్తంగా కాలనీలు, బస్తీలలో ప్రతివీధిలో రహదారులకు ఇరువైపులా స్వచ్ఛత నెలకొనేలా చేయడంతోపాటు మొక్కలు నాటాలన్నారు. వీధులను శుభ్రం చేయడం, నాలాలు డ్రైన్లలో వ్యర్థాల తొలగింపు, ఇళ్లలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించేలా చూడాలన్నారు. 5వ తేదీ జనసమ్మర్దం ఉన్న ప్రాంతాలు, ప్రధాన రహదారులు, పార్కులు, బస్టాండ్‌లు, మార్కెట్‌ ప్రాంతాలలో పారిశుద్ధ్యం, వ్యర్థాలు తొలగించాలన్నారు. 6వ తేదీ ఫాగింగ్‌, నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో నివారణ చర్యలు, బస్తీలు, బస్తీ దవాఖానాలలో డెంగ్యూ పాజిటివ్‌ కేసుల గుర్తింపు, వీధి శునకాలకు స్టెరిలైజేషన్‌ నిర్వహించాలన్నారు. 7వ తేదీ చెరువుల పరిరక్షణ చర్యలు , ఆక్రమణల గుర్తింపు చేపట్టాలన్నారు. 8వ తేదీ రెసిడెంట్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్లు, స్వయం సహాయక బృందాలు, బస్తీ కమిటీలతో సమావేశాలు నిర్వహించి ప్రజారోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్‌, పారిశుద్ధ్య, ఎంటమాలజీ, పొదుపు మహిళా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# నవోదయ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



నవోదయ కాలనీలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: నవోదయ కాలనీలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలి డివిజన్‌లోని నవోదయ కాలనీలో కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యటించి కాలనీవాసులలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ అవుట్‌లెట్‌ సమస్యకు కాలువల నిర్మాణానికి కావల్సిన ప్రణాళికలు సిద్ధం చేస్తే అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తామన్నారు. పార్కు స్థలంలో ఓపెన్‌ జిమ్‌, చిల్డ్రన్స్‌ పార్కు, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతోపాటు, విద్యుత్‌ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ఎంపీకి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌, శేరిలింగంపల్లి సర్కిల్‌ డీఈ విశాలాక్షి, జలమండలి మేనేజర్‌ అభిషేక్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# స్టాక్‌ మార్కెట్‌ పేరిట భారీ మోసం

రూ.2 కోట్ల 43 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేట్‌ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్‌: సైబర్‌ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. స్టాక్‌ మార్కెట్‌ పేరిట ప్రైవేట్‌ ఉద్యోగి నుంచి భారీగా నగదు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ఓ ప్రైవేట్‌ ఉద్యోగికి గత నెల 19వ తేదీ వాట్సప్‌ ద్వారా స్టాక్‌ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్‌ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేశారు. అపరిచిత స్టాక్‌ మార్కెట్‌ నిర్వాహకులు ఐడిని క్రియేట్‌ చేసి ఇచ్చారు. నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్‌ చేస్తూ రాగా వారు లాభాలు చూపిస్తూ వచ్చారు. మొత్తం 22 దఫాలుగా రూ. రెండు కోట్ల 43 లక్షలు ఇన్వెస్ట్‌ చేశాడు. దీంతో బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితులు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్‌క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, శనివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.